ఆగని బాల్య వివాహాలు

- పెళ్లి పీటలెక్కుతున్న చిన్నారులు
- నెలల వ్యవధిలోనే దంపతుల మధ్య విభేదాలు
- పోలీస్ స్టేషన్‌కు చేరుతున్న పంచాయితీలు

తాడిపత్రి రూరల్: తాడిపత్రి నియోజక వర్గంలో నిత్యం ఏదో ఒక పోలీసు స్టేషన్‌లో బాల్య వివాహాలు, ప్రేమ వివాహాలు, వేధింపుల సంఘటనల పంచాయతీలు, కౌన్సెలింగ్‌లు, కేసుల నమోదు పెరిగాయి. వివాహాల పేరుతో చిన్నారుల జీవితాలు ముళ్లబాటగామారుతున్నాయి. తల్లిదండ్రుల పేదరికం, నిరక్షరాస్యత, పెళ్లి చేస్తే బాధ్యత తీరిపోతుందని, పెద్దసంబంధం కుదిరిందంటూ అర్ధంతరంగా 10వ తరగతిలోపు చదువు మాన్పించి బాలికలకు వివాహాలు చేస్తున్నారు. బాల్య వివాహాలు చేసుకున్న బాలికలు సంసారం, కుటుంబ పోషణ, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. వివాహ బంధంపై అవగాహన లేక మానసికంగా కృంగిపోతున్నారు. అత్తవారింటిని బందీఖానాగా భావించి పుట్టింటికి వెళ్లాలన్న ఆలోచనలతో అనేక సమస్యలను కొనితెచ్చుకుంటున్నారు. అలాగే బాల్య వివాహాలు చేసుకున్న యువకులతోపాటు చేసిన వారు సైతం పోక్సో కేసుల బారిన పడుతున్నారు.

కఠిన నిబంధనలున్నా ..

బాల్య వివాహాల కట్టడికి కఠినమైన నిబంధనలు ఉన్నాయి.2006లోని బాల్య వివాహాల చట్టాన్ని మరింత కఠినం చేస్తూ 2012లో అప్పటి ప్రభుత్వం జీఓ 18 విడుదల చేసింది. బాల్య వివాహం చేసినా, ప్రోత్సహించినా రెండేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారు. బాల్య వివాహాల నియంత్రణకు 1098టోల్ ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచారు. అలాగే 2002లో వివాహాల రిజిస్ట్రేషన్ చట్టం అమలులోకి వచ్చింది. కానీ ఈ ఉత్తర్యులను అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బాల్య వివాహాల నియంత్రణకు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో కమిటీలు ఉన్నాయి. జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా, ఎస్పీ, ఐసీడీఎస్ పీడీ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కన్వీనర్లుగా ఉంటున్నారు. డివిజన్ స్థాయిలో ఆర్డీఓ చైర్మన్‌గా, డీఎస్పీ, సీడీపీఓ, స్వచ్ఛంద ప్రతినిధులు కన్వీనర్లుగా, మండలస్థాయిలో తహసీల్దార్ చైర్మన్‌గా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, ఎంపీడీఓ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కన్వీనర్లుగా, గ్రామస్థాయిలో సర్పంచ్ చైర్మన్‌గా, అంగన్‌వాడీ టీచర్ కన్వీనర్‌గా, హెచ్ఎం, కార్యదర్శి, ఎఎన్ఎం, వార్డు మెంబర్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, మహిళా సంఘాలు సభ్యులుగా ఉంటున్నప్పటికి బాల్య వివాహాల సంఖ్య పెరుగుతోంది.

- తాడిపత్రి పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లి కాలనీలో యుక్త వయస్సు రాకమునుపే తల్లిదండ్రులు బలవంతంగా కూతురికి 2022లో వివాహం చేశారు. వివాహ బంధంపై తగిన మెచ్యూరిటీ రాక పోవడంతో అత్తవారింట్లో ఎప్పుడు గొడవలే. చివరికి భార్య,భర్తల పంచాయితీ పది రోజుల క్రితం అప్‌గ్రేడ్ పోలీసుస్టేషన్‌కు చేరింది. విచారణలో ఇద్దరి జనన ధ్రువీకరణ పత్రాలు పరిశీలిస్తే ఇప్పటికీ యువతి వయస్సు మైనార్టీ తీరకపోవడం గమనార్హం. చివరికి ఈ పంచాయితీ విడాకుల వరకూ వచ్చింది
- పెద్దవడుగూరు మండలం కొండుపల్లిలో మైనార్టీ తీరకనే తల్లిదండ్రులు కూతురికి వివాహం చేశారు. ప్రస్తుతం యువతి గర్భవతి. దంపతుల మధ్య విభేదాలు నెలకొనడంతో యువతి పుట్టింటికి వచ్చింది. భర్తతో పాటు అత్తమామలపై 1098టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి వారి నుంచి తనను కాపాడాలని ప్రాధేయపడింది. దీంతో పోలీసులు, ఐసీడీఎస్ అధికారులు జోక్యం చేసుకున్నారు. మరోవైపు మైనార్టీ తీరకనే వివాహం చేయడంతో గర్భవతికి అంగన్‌వాడీ ద్వారా పౌష్టికాహారం సమస్యగా మారింది. చివరికి గర్భవతి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పౌష్టికాహారం ఇస్తున్నారు.
- బాల్య వివాహం కారణంగా యాడికి మండల కేంద్రానికి చెందిన జయసింహతో పాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. తాడిపత్రి మండలం చిన్నపోలమడ గ్రామానికి చెందిన యువతిని 2022 ఏప్రిల్ 21న వివాహం చేసుకున్నాడు. బాల్య వివాహం చేసిన వారితో పాటు భర్తపై పోలీసులు కేసు నమోదు చేశారు.



తాడిపత్రిలో కిశోరి బాలికలకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఐసీడీఎస్, వైద్య సిబ్బంది (ఫైల్)

బాల్య వివాహాలు అడ్డుకుంటున్నాం



తాడిపత్రి ప్రాజెక్టు పరిధిలో 42 బాల్య వివాహాలను అడ్డుకున్నాం. బాల్య వివాహాలపై కిశోరి బాలికలు, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్నాం. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే ప్రజలు మాకు సమాచారం ఇస్తే, వారి వివరాలను గోప్యంగా ఉంచుతాం.

– సాజిదాబేగం, సీడీపీఓ, తాడిపత్రి

క్లుప్తంగా

కమనీయం.. చెన్నకేశవుడి కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మండలంలోని కుమ్మెతలో శనివారం లక్ష్మీ చెన్నకేశవస్వామి కల్యాణోత్సవం కనుల పండువగా నిర్వహించారు. వేదపండితులు ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి పెళ్లి మండపానికి ఊరేగింపుగా తీసుకువచ్చి కల్యాణం జరిపించారు. వేడుకలను తిలకించడానికి ఆంధ్రా, కర్ణాటక తదితర ప్రాంతాలనుంచి భక్తులు తరలివచ్చారు. కోర్కెలు నెరవేరిన భక్తులు స్వామి వారికి ముడుపులు, కానుకలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వచ్చిన భక్తులకు ఆలయకమిటీ సభ్యులు తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సాయంత్రం సేద్యపు ఎద్దుల రాతిదూలం పోటీలను నిర్వహించి గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులను అందజేశారు.

మున్సిపాలిటీలో పదోన్నతులు

గుంతకల్లుటౌన్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న పలువురు అధికారులు పదోన్నతులు పొందారు. కమిషనర్ నయీమ్ అహ్మద్ గ్రేడ్-2 స్థాయి నుంచి గ్రేడ్-1గానూ, టీపీఎస్ అబ్దుల్ సత్తార్ టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌గా, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు ఆర్‌ఓగా పదోన్నతులు పొందినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం కమిషనర్ చాంబర్‌లో పదోన్నతులు పొందిన అధికారులకు వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

బుక్కరాయసముద్రం: బీకేఎస్ మండల కేంద్రంలో సోమవారం పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి నల్లప్ప శనివారం తెలిపారు. ఆరోజు శ్రమదానం కార్యక్రమంలో భాగంగా బీకేఎస్ నుంచి సిద్దరాంపురం వరకూ గుంతలు పూడ్చే కార్యక్రమం చేపడతామన్నారు. అలాగే సిద్దరాంపురం దళితుల శ్మశానానికి వెళ్లేదారికి కంప చెట్లు తొలగింపు, మజ్జిగ పంపిణీ నిర్వహిస్తామన్నారు.

ఎక్సైజ్ సీఐగా ఉమాదేవి



గుత్తి: గుత్తి ఎక్సైజ్ పోలీసు స్టేషన్ సీఐగా కె.ఉమాదేవి శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పని చేస్తున్న మోహన్‌రెడ్డి మడకశిర ఎక్సైజ్ మొబైల్ పోలీసు స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అనకాపల్లిలో సీఐగా పని చేస్తున్న ఉమాదేవిని ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. నూతన సీఐని ఎక్సైజ్ సీఐలు అస్లాం బేగ్, గోపాల్‌తో పాటు హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

హెచ్ఐవీపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళాకారుల బృందం

తాడిపత్రి: ఎయిడ్స్, హెచ్ఐవీపై జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వీధి నాటకం ద్వారా మండలంలోని చుక్కలూరు గ్రామంలో శనివారం అవగాహన కల్పించారు. తరిమెల రాజు కళా బృందం గ్రామ క్రాసింగ్‌లో హెచ్ఐవీ వైరస్, ఎయిడ్స్ వ్యాప్తి సంక్రమణ, నియంత్రణపై వీధి నాటకం ద్వారా వివరించారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి కౌన్సిలర్ ప్రతిభ, మాస్ ఎడ్యుకేషన్ ఆర్గనైజేషన్ పీయాటూ తాడిపత్రి ప్రాజెక్ట్ మేనేజర్ జగన్నాథరెడ్డి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఓఆర్‌డబ్ల్యూలు హమీద, హాజీరా, సునీత, కేజియాపీర్, ఎడ్యుకేటర్ సుకన్య, కళాకారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అయ్యప్పస్వామికి మొక్కుకుంటున్న భక్తులు

యాడికి: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ఆలయ 26వ వార్షికోత్సవాన్ని ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పూజారి నాగరాజు శర్మ, గురు స్వామి హరిస్వామి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. కార్యక్రమంలో సోమశేఖర్, ప్రసాద్, చిట్టి స్వామి, నరేష్, జగదీష్, శ్రీధర్, శివప్రసాద్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జూలై 5న జాతీయ లోక్‌అదాలత్



మాట్లాడుతున్న జడ్జి మంజుల

గుంతకల్లుటౌన్: స్థానిక జేఎఫ్‌సీఎం కోర్టులో జూలై 5వ తేదీన జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జూనియర్ సివిల్ జడ్జి మంజుల తెలిపారు. లోక్ అదాలత్ నిర్వహణపై శనివారం సాయంత్రం కోర్టు హాల్‌లో న్యాయవాదులు, పోలీసు, ఎక్సైజ్, కోర్టు అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. రాజీపడదగిన కేసులేవైనా ఉంటే వాటిని జాతీయ లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకునేందుకు తగు ఏర్పాట్లు చేసుకోవాలని జడ్జి సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ సుహాసిని, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జయరామ్, న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

20న వాహనాల వేలం

గుంతకల్లు: స్థానిక రాజేంద్రనగర్‌లోని ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో ఈ నెల 20 వాహనాల వేలం నిర్వహించనున్నట్లు సీఐ శివసాగర్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఐడీ, ఎన్‌డీపీఎల్, డీపీఎల్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను దక్కించుకోవటానికి 20వ తేదీ 10.30 గంటల్లోపు రూ.2 వేలు ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

రూ.5 లక్షల విరాళం అందజేత

పామిడి: పట్టణంలోని సరస్వతీ విద్యామందిరానికి శనివారం గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్‌గుప్తా, ఆయన సోదరుడు, పారిశ్రామికవేత్త కొట్రికె శ్రీహరి సంయుక్తంగా రూ.5లక్షలు విరాళం ఇచ్చారు. ఈ డబ్బును వారు చెక్కు రూపాన కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ సభ్యులు రత్నమయ్య, బొల్లు శ్రీనివాసరెడ్డి, బాల నాగరాజు, బసవరాజు, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్ రాజ్యాంగంతో రాక్షస పాలన



మాట్లాడుతున్న గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి

గుంతకల్లుటౌన్: సీఎం చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ రాక్షస పాలన సాగిస్తోందని గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి ధ్వజమెత్తారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లిక్కర్ కేసుతో సంబంధం లేని రిటైర్డ్ ఉన్నతాధికారులు ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలను అప్రజాస్వామికంగా అరెస్ట్ చేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను లక్ష్యంగా చేసుకున్న కూటమి సర్కారు వైఎస్సార్‌సీపీ నేతలు, రిటైర్డ్ ఉన్నతాధికారులపై కక్ష సాధింపు చర్యలు చేపడుతోందని నిప్పులు చెరిగారు. ప్రజలకిచ్చిన హామీలను అమలు చేయలేని అసమర్థతను, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని విమర్శించారు. బాబూ పాలనలోనే భారీ లిక్కర్‌స్కామ్ జరిగిందని, విచ్చలవిడిగా బెల్ట్‌షాపులను ఏర్పాటు చేయించి కోట్లాది రూపాయలతో బాబూ అండ్ బ్యాచ్ తమ జేబులు నింపుకుందన్నారు. ఎక్కడా జరగని మద్యం కుంభకోణాన్ని సృష్టించి, ఇందులో వైఎస్. జగన్‌ను ఇరికించి అరెస్ట్ చేయాలనే కుట్రతోనే చంద్రబాబు పనిచేస్తున్నారని మండిపడ్డారు.

గత ప్రభుత్వంలోనే సోలార్ పవర్ గ్రిడ్‌కు భూముల సేకరణ

గుంతకల్లు నియోజకవర్గంలోని తిమ్మాపురం, దోనిముక్కల గ్రామాల మధ్యన సోలార్ పవర్‌గ్రిడ్ ఏర్పాటుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే సుమారు 500 ఎకరాల భూసేకరణ ప్రక్రియ జరిగిందని మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ స్పష్టం చేశారు. తమ వల్లే క్లీన్ ఎనర్జీ వచ్చిందని విద్యాశాఖ మంత్రి లోకేష్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆయా కంపెనీలు, రైతుల మధ్య రేట్ల విషయంలో ఏర్పడిన వివాదం వల్ల గ్రిడ్ ఏర్పాటుకు జాప్యం జరిగిందని ఆయన వెల్లడించారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ జింకల రామాంజినేయులు, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు ఖలీల్, బోయరాము, కౌన్సిలర్లు చాంద్‌బాషా, లింగన్న, సీనియర్ నాయకులు భీమలింగప్ప, నూర్‌నిజామి, పార్టీ అనుబంధ విభాగాల నియోజకవర్గం అధ్యక్షులు రంగనాయకులు, బాసిద్, వీరేష్, అంజి, వంశీ, బాబూరావు, వార్డు ఇన్‌ఛార్జ్‌లు ఎల్లప్ప, శేఖర్, దర్గానాయుడు, రంగా, తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్‌లు అప్రజాస్వామికం



మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి

తాడిపత్రిటౌన్: మాజీ ఐఏఎస్ అధికారి ధనుంజయ రెడ్డి, మాజీ ప్రభుత్వాధికారి కృష్ణమోహన్‌రెడ్డి అరెస్ట్‌ను ఖండిస్తున్నామని తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి అన్నారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయ నుంచి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. చంద్రబాబు చేస్తున్న కక్ష రాజకీయాల కారణంగా వ్యవస్థలు దెబ్బతింటున్నాయన్నారు. అక్రమ కేసులు పెట్టించి, తప్పుడు సాక్ష్యాలు, వాంగ్మూలాలు సృష్టిస్తున్నారన్నారు. ప్రభుత్వ అధికారులు, మాజీ అధికారులపై విరోధం చూపించడం తగదన్నారు. చంద్రబాబు తీసుకొస్తున్న తప్పుడు సంప్రదాయాలు రాష్ట్రానికి చేటు చేస్తున్నాయన్నారు. లిక్కర్ వ్యవహారంలో ఇప్పటి వరకు ఎలాంటి ఆధారాలు చూపకపోయినా అధికారులను బెదిరించి, భయపెట్టి తప్పుడు వాంగ్మూలాలు తీసుకుని అరెస్ట్ చేయడం దారుణమన్నారు. లేని స్కాంలు, తప్పుడు సాక్ష్యాలు సృష్టించి నచ్చని వారిని కేసుల్లో ఇరికించి, రాజకీయ లబ్ధి పొందాలని ప్రయత్నిస్తున్నారన్నారు.

పిడుగు పాటుకు గడ్డి దగ్ధం



బోగాలకట్టలో పిడుగు పడటంతో దగ్ధమైన గడ్డి



తాడిపత్రి ప్రధాన రహదారిపై నీరు నిలిచిన దృశ్యం

యాడికి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం రాత్రి వర్షం కురిసింది. చందన, లక్షుంపల్లి, రాయలచెరువు, తూట్రాళ్లపల్లి, నగరూరు, వెంగన్నపల్లి, పుప్పాల వేములపాడు కోనుప్పలపాడు, యాడికి, కమలపాడు పంచాయతీల్లో అరటి, బొప్పాయి పంటలను సాగు చేసిన రైతులు వర్షం పడటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు. బోగాలకట్ట గ్రామ సమీపంలో పిడుగు పడటంతో వరిగడ్డి దగ్ధమైంది. గడ్డి సమీపంలో ప్రజలు ఎవరూ లేకపోవడంతో ఎటువంటి ప్రాణాపాయం కలగలేదని గ్రామానికి చెందిన హనుమంతరెడ్డి తెలిపారు.

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణంలో శనివారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. దీంతో పలుచోట్ల ప్రధాన రహదారిపై నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. కూరగాయల మార్కెట్, సాయితేజ థియేటర్ వద్ద ప్రధాన రహదారిపై నిలిచిన నీరు కుంటను తలపించింది. అలాగే పట్టణంలోని అంబేడ్కర్ కాలనీ, క్రిష్ణాపురం , ఓల్డ్ రైస్‌మిల్ ఏరియా, టైలర్స్ కాలనీ, బిందెల కాలనీల్లో నీరు నిలవడంతో ఆయా కాలనీ వాసులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో పట్టణంలో అంధకారం నెలకొంది.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా రెండు రోజుల్లో అకాల వర్షాలు కురుస్తున్నట్లు వాతావరణశాఖ నుంచి సమాచారం అందినట్లు డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జున తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు, ప్రజలు పొలాలకు వెళ్లేటప్పుడు, కాలువలు దాటుకునేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రాబోయే రెండు రోజులు పిడుగులు పడే అవకాశం ఉందని, వర్షం కురుస్తున్న సమయంలో చెట్ల కింద ఉండ కూడదని, కరెంట్ స్తంభాలకు దూరంగా ఉండాలన్నారు. అధికారులు ఆయా గ్రామాల్లో వర్షాలపై అవగాహన కల్పించి, అప్రమత్తంగా ఉండాలన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని వంకవీధిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం ఉదయం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య స్వామివారి మూలవిరాట్ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం ధ్వజ స్తంభ స్థాపన నిర్వహించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.

విలేకరికి బెదిరింపులు.. ఇద్దరిపై కేసు నమోదు

తాడిపత్రిటౌన్: యాడికి విలేకరి (సాక్షి కాదు) రామక్రిష్ణను అదే మండలానికి చెందిన ఇద్దరు అధికార పార్టీకి చెందిన రౌడీషీటర్లు బెదిరింపులకు దిగుతూ చేసిన వీడియోలపై ఎట్టకేలకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ విషయాన్ని ఫిర్యాదుదారుడికి కూడా తెలపకుండా పోలీసులు గోప్యంగా ఉంచారు. ఆలస్యంగా వెలుగు చూసిన విషయం ఏమంటే... ఏప్రిల్ 1న యాడికి మండలం రాయలచెరువు గ్రామానికి చెందిన రౌడీషీటర్లు పరిమి చరణ్, మదమంచి శివప్రసాద్ నాయుడు వార్త విలేకరి రామక్రిష్ణను బెదిరిస్తూ వీడియో చేసి సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేశారు. దీనిపై బాధితుడు పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు జాతీయ మానవ హక్కుల సంఘాన్ని ఆశ్రయించాడు. దాదాపు నెల రోజుల పాటు చేసిన పోరాటంతోపాటు కోర్టు ఆదేశాలకు స్పందించిన పోలీసులు ఎట్టకేలకు బెదిరింపులకు పాల్పడిన రౌడీషీటర్లపై కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: రైతులు, కూలీల సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 20న చేపడుతున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని జిల్లా కమిటీ సభ్యుడు రామాంజనేయులు కోరారు. శనివారం మండలంలోని కసాపురం గ్రామంలో సమ్మె పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నల్ల చట్టాలను రద్దు చేస్తామని ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం ఇంతవరకూ ఆదిశగా చర్యలు చేపట్టకపోవడం, మార్కెట్ వ్యవస్థను ప్రైవేటీకరణ చేయడం, రైతులకు సరైన గిట్టుబాటు ధర కల్పించడకపోవడంతో రైతులు, కూలీలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 20న సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు నాయకులు తెలిపారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లల మృతి

పెద్దవడుగూరు: మండలంలోని చిన్నవడుగూరు గ్రామానికి చెందిన నాగేశ్వర అనే కాపరికి చెందిన 25 గొర్రె పిల్లలను వీధి కుక్కలు దాడి చేసి చంపిన ఘటన చోటు చేసుకొంది. బాధితుడు కల్లం దొడ్డిలో పిల్లలను ఉంచి పెద్ద గొర్రెలు, మేకలను తోలుకుని మేత కోసం అడవికి వెళ్లాడు. సాయంత్రం దొడ్డి లోకి వచ్చి చూడగా చెల్లాచెదురుగా మృతి చెందిన పిల్లలు కనపడటంతో కన్నీరుమున్నీరయ్యాడు. సుమారుగా 20 వేల దాకా నష్టం వాటిల్లినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

దాడి ఘటనలో ఇద్దరిపై కేసు

యాడికి: పొలంలోని రస్తా విషయంలో శుక్రవారం రాత్రి వ్యక్తిపై దాడికి పాల్పడిన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. వివరాలు.. మండలంలోని వెంగన్నపల్లిలో నరసింహ అనే వ్యక్తికి రమేష్, సుబ్బరాయుడు అనే వ్యక్తులకు పొలం వద్ద రస్తా సమస్యలున్నాయి. శుక్రవారం రెండు వర్గాల మధ్య వాదనలు పెరిగి గొడవలు జరిగాయి. గాయపడిన నరసింహ ఫిర్యాదు మేరకు సుమ్మరాయుడు, రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

హోరాహోరీగా రాతి దూలం లాగుడు పోటీలు



రాతిదూలం లాగుతున్న ఎద్దులు

పెద్దవడుగూరు: మండల కేంద్రంలోని వంక వీధిలో నూతనంగా నిర్మించిన ఆంజనేయస్వామి ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు రాష్ట్ర స్థాయి దేశవు ఎద్దులు రాతిదూలం లాగుడు పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి సుమారుగా 12 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొనగా పెద్దవడుగూరు గ్రామానికి చెందిన పరదేశి కిష్టప్పకు చెందిన ఎద్దులు ప్రథమ స్థానంలో నిలిచాయి. రెండో స్థానంలో తుగ్గలి ధర్మరాజు, మూడో స్థానంలో పెద్దవడుగూరు యంపలాకు నాగేష్, నాలుగో స్థానంలో కర్నూలు జిల్లా నేమకల్లు సర్పంచ్ ప్రేమ్‌కుమార్, ఐదో స్థానంలో పెద్దవడుగూరు ముత్యాలరెడ్డి, వంకరాజు కాలువ గోపాల్ ఎద్దులు నిలిచాయి. అనంతరం వృషభ యజమానులకు గ్రామ పెద్దలు బహుమతులందజేశారు.

అగ్ని ప్రమాదంలో లారీ ఇంజిన్ దగ్ధం



గార్లదిన్నె: మండలంలోని కల్లూరు 44వ జాతీయ రహదారిపై శనివారం ఓ లారీ మంటల్లో కాలిపోయిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన లారీ అనంతపురం నుంచి ఉదయం రాయచూర్‌కు బయలుదేరింది. ఎండలు తీవ్రత ఎక్కువ ఉండడంతో ఇంజిన్‌లో షార్ట్ సర్క్యూట్ వల్ల శబ్దం రావడంతో డ్రైవర్ రఘుపతి అప్రమత్తమై లారీని రోడ్డుపక్కన నిలిపి పరిశీలిస్తుండగా.. ఇంజన్‌లో మంటలు రావడం గమనించాడు. మంటలు పూర్తిగా వ్యాపించడంతో ఇంజిన్ కాలిపోయింది. ఫైర్ సిబ్బంది వెళ్లి మంటలను అదుపు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

గుంతకల్లు/గుంతకల్లు టౌన్/గుంతకల్లు రూరల్/గుత్తి/యాడికి/శింగనమల/పామిడి: పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఎంపీపీ రాజాబాబు అన్నారు. శనివారం గుంతకల్లు పట్టణంలోని హౌసింగ్ బోర్డు కార్యాలయం ఉన్న ఎంపీపీ కార్యాలయంలో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, కార్యాలయం సిబ్బందితోపాటు లైసెన్స్ దారులు, ఆటోడ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల శుభ్రత పాటించి స్వర్ణ గుంతకల్లుగా తీర్చిదిద్దుకుందామని పిలుపునిచ్చారు. మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. అలాగే స్వచ్ఛాంధ్ర నిర్మాణానికి పాటుపడుదామని డీఎల్‌డీఓ విజయలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా బీట్ ది హీట్‌పై అవగాహన కల్పించారు. అనంతరం డీఎల్‌డీఓ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటి నీరు పోశారు. మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- గుంతకల్లు తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం తహసీల్దార్ రమాదేవి, సిబ్బందితో కలిసి ప్రతిజ్ఞ చేశారు.
- గుత్తిలో శనివారం మున్సిపల్, సచివాలయ సిబ్బంది, ఆర్పీలు, ఆరోగ్య సిబ్బంది స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంపై అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, మెప్మా కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, సచివాలయ , మున్సిపల్ ఉద్యోగులు,సిబ్బంది పాల్గొన్నారు.
- యాడికిలోని ప్రభుత్వాస్పత్రిలో శనివారం ఎంపీడీఓ వీరరాజు, వైద్యాధికారి పరమేశ్వర స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు, పంచాయతీ ఈఓ అశ్వర్థ నాయుడు, వైద్య సిబ్బంది రామ్ ప్రసాద్ గౌడ్, మద్దిలేటి ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.
- శింగనమల మండలంలోని తరిమెల పీహెచ్‌సీ పరిధిలో తరిమెలలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు స్వచ్ఛతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్ నాయక్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.
- పామిడిలో ఎంపీడీఓ కే తేజోత్స్న ఆధ్వర్యంలో సచ్ఛాంధ్ర కార్యక్రమంపై ర్యాలీ చేపట్టారు.

బంగారం, వెండి అపహరణ



బీరువాలో నగలను ఎత్తుకెళ్లిన దృశ్యం

గుంతకల్లు రూరల్: పట్టణ శివారులోని జగ్జీవన్ రామ్ కాలనీలో శనివారం మధ్యాహ్నం తాళం వేసిన ఇంట్లోకి చొరబడిన దొంగలు 8.5 తులాల బంగారం ఆరు తులాల వెండి అపహరించుకెళ్లారు. జగ్జీవన్ రామ్ కాలనీలో తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్న ఫకృద్దీన్ గుంతకల్లు పట్టణంలోని ఆంధ్ర బ్యాంకుకు వెళ్లే దారిలో చెరుకు మిషన్ బండి నిర్వహిస్తున్నాడు. ఆయన భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శనివారం యథావిధిగా చెరకు మిషన్ దగ్గరకు ఫకృద్దీన్ బయలు దేరగా, భార్య బషీరున్నీసా స్కూల్లో పనికి బయలు దేరింది. ఇద్దరు కుమారులు పనులకు వెళ్లగా, కూతురు భాను మాత్రమే ఇంట్లో ఉంది. ఆమె తన కూతురుకు బాగోలేకపోవడంతో ఇంటికి తాళం వేసి కిటికీలో ఉన్న చిన్న డబ్బాలో తాళాలు పెట్టి గుంతకల్లు ప్రభుత్వాస్పత్రికి వెళ్లింది. అదే సమయంలో డబ్బాలో ఉన్న తాళాలు తీసుకొని ఇంట్లోకి చొరబడిన దొంగలు బీరువాలో ఉన్న బంగారు, వెండిని ఎత్తుకెళ్లారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బీరువాలో బట్టలు ఏమాత్రం చెదరకుండా నగలను మాత్రం తీసుకెళ్లిన దాన్ని బట్టి చూస్తే అన్ని తెలిసిన వాళ్ల పనే అయి ఉంటుందని భావిస్తున్నారు.